క్లుప్తంగా

కొత్తకూర్మినాయుడుపేటలో వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తకూర్మినాయుడుపేటలో గురువారం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు గీతా ప్రియ, పి.శివమణి పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సంతోషిమాతకు జన్మనక్షత్ర పూజలు



శ్రీకాకుళం కల్చరల్ :పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత దేవాలయంలో అమ్మవారి స్వాతీ నక్షత్రం సందర్భంగా గురువారం జన్మనక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార సహిత సహస్ర నామార్చనలు, విశేష కుంకుమ పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ పిట్టపాలెం నుంచి లావేరు మండలం గుమడాం పంచాయతీ నాగప్పాలెం వరకు 1.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, పంచాయతీరాజ్ జేఈ అప్పారావు, సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం, కుశాలపురం బైపాస్ కూడలి వద్ద కిరాణా దుకాణాల్లో గురువారం ఎచ్చెర్ల పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.సందీప్ మాట్లాడుతూ గంజాయి నియంత్రణలో భాగంగా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.


మోడల్ స్కూల్ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జి.సిగడాం: జి.సిగడాం మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు వి.వైకుంఠరావు, డోల వరప్రసాదరావు, ఎ.ఈశ్వర్, ఆర్.తేజ రాష్ట్రస్థాయిలో విద్యుత్ వినియోగంపై నిర్వహించిన లఘుచిత్రం పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఈ నెల 20న విజయవాడలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా తెలుగు అధ్యాపకులు కోట తిరుపతి రావు, విద్యార్థులు రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, సలీమ్, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ, అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: క్రిస్మస్ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు చేతుల మీదుగా బుధవారం 25 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాన్యుడికి షాక్

- విద్యుత్ బిల్లుల భారం మోపిన కూటమి సర్కారు
- ఆందోళనలో గృహ వినియోగదారులు
- సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసిన పాలకులు



ఎచ్చెర్ల సబ్ స్టేషన్

ఎచ్చెర్ల క్యాంపస్:

కూటమి ప్రభుత్వం సామాన్యులకు షాక్ ఇస్తోంది. సూపర్‌సిక్స్ హామీల సంగతి అటుంచితే ప్రస్తుతమున్న విద్యుత్ చార్జీలను భారీగా పెంచేసి పేదల నడ్డి విరుస్తోంది. సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు అంటూ బిల్లులు భారీగా పెంచేస్తోంది. దీంతో సామాన్య గృహ వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. కొత్త ప్రభుత్వం చార్జీలు తగ్గించాల్సింది పోయి పెంచడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గాల్లో జరగనున్న ఆందోళనలో సామాన్య ప్రజలు సైతం పాల్గొని పాలకులను నిలదీయనున్నారు.

మండలం	గృహాలకు వినియోగిస్తున్న మీటర్లు
ఎచ్చెర్ల	27950
రణస్థలం	26193
లావేరు	18580
జి.సిగడాం	19760

నెరవేరని హామీలు..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీల అమలు ఊసే లేదు. ఉచిత గ్యాస్ డబ్బులు ఇప్పటికీ చాలామంది ఖాతాల్లో జమ కావడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలు అంటూ తప్పించుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 50 ఏళ్లకే సామాజిక పింఛన్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు.. ఇలా ఏ ఒక్క హామీ కూడా కార్యరూపం దాల్చకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసహనంతో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీల భారం మోపడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సామాన్య ప్రజలతో పాటు అన్ని ప్రజా సంఘాలు విద్యుత్ సర్దుబాటు చార్జీలను వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ చార్జీలు పెరుగుదలపై రణస్థలం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం ఆందోళన నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం నుంచి పార్టీశ్రేణులు, ఇతర వర్గాలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

ప్రజలు క్షమించరు..



కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోకుండా విద్యుత్ చార్జీలు పెంచడం తగదు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోతే ప్రజలు క్షమించరు.

– అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్, అరిణాం అక్కివలస

హామీల సంగతేంటి?



సూపర్‌సిక్స్ హామీల అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేదు. హామీలు ఇచ్చేటప్పుడు సాధ్యాసాధ్యాలను పరిలించాలి. అధికారంలో వచ్చాక విస్మరించడం తగదు.

– దుంప అప్పయ్యమ్మ, సర్పంచ్, ఎస్ఎస్ఆర్ పురం

ప్రజల తరఫున పోరాటం



ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నాం. రైతులు సమస్యపై గతంలో ఉద్యమం చేశాం. ప్రస్తుతం విద్యుత్ చార్జీల పెరుగుదలపై పోరాటం సాగిస్తున్నాం. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ పోరుబాటకు తరలిరండి



గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పార్టీ శ్రేణులు, గృహ వినియోగదారులు తరలిరావాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల చార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్లతో పోరుబాట చేపట్టనున్నామని తెలిపారు. రణస్థలం-రామతీర్థాలు కూడలి నుంచి ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీగా వెళ్లి రణస్థలం విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తామని పేర్కొన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రైతు సోదరులు, విద్యుత్ వినియోగదారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకాకుళం నగరంలో..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ కూడలి నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజవర్గ ప్రజలంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యువతకు ఆదర్శం ఎం.వి.వి.ఎస్.శాస్త్రి



శాస్త్రిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యారావు

శ్రీకాకుళం అర్బన్: సుమారు 2500 కోర్సులకు సంబంధించిన డిగ్రీలను పూర్తిచేసిన ఎం.వి.వి.ఎస్.శాస్త్రి నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. గురువారం శ్రీకాకుళంలో శాస్త్రిని సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రెండేళ్ల వ్యవధిలో 2500 కోర్సులు పూర్తిచేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, రెండు తెలుగు రాష్ట్రాల రికార్డులు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులలో శాస్త్రి పేరు సంపాదించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో తొగరాం నీటి సంఘం అధ్యక్షుడు, కళింగ సంక్షేమ సేవాసంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామ మూర్తి పాల్గొన్నారు.

సమ్మె కాలం ఒప్పందాలు అమలుచేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమ్మెకాలం ఒప్పందాలు అమలుచేయాలని, లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ -ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కల్యాణరాజు, అరుగుల రాము, ఎ.మోహన్, ఎస్.పార్వతి, ఎ.లక్ష్మి, ఎం.ఆదెమ్మ, గిరిజా శంకర్, సోమేష్ మణికంఠ, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని గోల్కొండ రేవువీధిలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు గురువారం సాయం అందించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు, దుస్తులు కాలిపోయాయని, బాధితులు సరుకులు, వస్త్రాలు అందజేశామని పేర్కొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శశిభూషణరావు

ఎచ్చెర్ల:

కేజీబీవీ విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంపతిరావు శశిభూషణరావు అన్నారు. గురువారం లావేరు మండలం మురపాక కేజీబీవీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

అలరించిన క్రిస్మస్ గీతాలు




శ్రీకాకుళం కల్చరల్: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మహాలక్ష్మీనగర్ కాలనీలో ఎలోహిం చర్చి ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎం.సురేష్ ఐజాక్ నిర్వహణలో పాస్టర్ జాకబ్ గోడి దైవవాక్యం వినిపించారు. అనంతరం భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఉషారాణి, ప్రిస్కిల్లా, గిరిరాజు, నాయక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు జాన్ విల్సన్‌బాబు, రేవ్ మనోజ్ కుమార్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో అనిత, శాంతి చంద్రిక, మేరిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మండవిల్లికి కృష్ణదాస్ పరామర్శ



మండవల్లి రవితో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ మీడియా సెల్ అధ్యక్షుడు మండవిల్లి రవి తల్లి మంగతాయారు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం పరామర్శించారు. రవితో మాట్లాడి ధైర్యం చెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు పరిసర ప్రాంతంలో భిక్షాటన చేసే ఓ వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన కోళ్ళవలస ఈశ్వరరావు (48) చిన్నతనం నుంచే సాధువులతో కలిసి భిక్షాటన చేస్తుండేవాడు. ఇటీవల కుక్క కరవడంతో సెప్టిక్ కావడంతో తిండిలేక పూర్తిగా నీరసించిపోయాడు. ఈ క్రమంలో పెదపాడు అప్పన్నమ్మ ఆలయ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద బుధవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

భజరంగ్‌వాహినీ దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సాయిగౌతమ్



సాయిగౌతమ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన బలివాడ సాయిగౌతమ్ భజరంగ్‌వాహినీ దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు గజరాజ్‌సింగ్ గుజ్జర్ నుంచి ఉత్తర్వులు అందాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమే తమ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గోతులు



పాగిరి– జి.సిగడాం గ్రామాల మధ్య రహదారిలో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గొయ్యిల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– జి.సిగడాం

ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ వితరణ



ఎచ్చెర్ల మండలం భగీరథిపురం గ్రామానికి చెందిన కోరాడ మోహనరావుకు కత్తెరవీధికి చెందిన బాదిరెడ్డి విజయప్రసాద్ సహకారంతో రూ.35 వేలు విలువైన ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సమక్షంలో గురువారం అందజేశారు.కార్యక్రమంలో కోరాడ మోహనరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, బొట్టా సాయికుమార్, పొడుగు చరణ్, ఉర్లాం శివతేజ, తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ధనుర్మాస వ్రతంతో మోక్షం



ధనుర్మాస వ్రతం ఆచరిస్తే మోక్షం కలుగుతుందని విశ్రాంత తెలుగు పండితుడు గురుగుబెల్లి లక్ష్మీనారాయణ అన్నారు. తిరుప్పావై ప్రవచనాలలో భాగంగా ఫరీదుపేటలోని రామాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ధనుర్మాసంలో భక్తులకు శ్రీమన్నారాయణుడి అనుగ్రహం కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ధనుర్మాస వ్రతం విధానం వివరించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు అంపోలు వైకుంఠ రామానుజదాసు, భక్తులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

తడిచిన ధాన్యం పరిశీలన



శ్రీకూర్మంలో వరి పనలను పరిశీలిస్తున్న జేడీఏ త్రినాథస్వామి

గార: వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలని ప్రభుత్వానికి తెలియజేస్తామని జేడీఏ కె.త్రినాథస్వామి అన్నారు. శ్రీకూర్మంలో తడిచిన వరి పనలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారం రోజులుగా ముసురు పెట్టడం వల్ల లోతట్టు పొలాల్లో నీరు నిలిచిపోయి మొలకలు బయటకు వచ్చాయన్నారు. శ్రీకూర్మం ప్రాంతంలోనే 900 ఎకరాల్లో పంట పాడైందని కోరాడ వెంకటరావు తెలిపారు. ఇదిలా ఉండగా 'సాక్షి'లో వచ్చిన కథనంపై బూరవెల్లి రైతులు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో ఫోన్‌లో వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏడీఏ బగ్గు రజిని, ఏవో డి.పద్మావతి పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పెంట గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఏఓ శారద

జి.సిగడాం: ఎడతెరిపి లేని వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి యర్రా శారద గురువారం పరిశీలించారు. పెంట గ్రామంలో పెసర, మినుము పంటలు పూర్తిగా నాశనమయ్యాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ తలచింతల కుసుమ, సిబ్బంది ఉన్నారు.

డేటా సైన్స్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

శ్రీకాకుళం న్యూకాలనీ: డేటా సైన్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని ఎర్నెస్ట్ అండ్ యంగ్ కంపెనీ డేటా అనలిస్ట్ జి.చంద్రసదన్ పేర్కొన్నారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం డేటా సైన్స్ విభాగం నిర్వహించిన ఇంటర్నల్ ఫెస్ట్‌లో పాల్గొన్న చంద్రసదన్ తొలుత చార్లెస్ బాబేజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్స్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయ్ సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం రూరల్: భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయ్ సేవలు మరువలేనివని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీ, గాయత్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. అంత్యోదయ నినాదంతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన గొప్ప నాయకుడు వాజ్‌పేయ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉమామహేశ్వరరావు, తేజేశ్వరరావు, పైడి వేణుగోపాలం, పూడి తిరుపతి రావు, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఉత్తమ బోధన



కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందించడమే లక్ష్యంగా ఫ్యాకల్టీ కృషి చేయాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంద్ర అమరేంద్రకుమార్ అన్నారు. క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ పర్యవేక్షణలో ఎస్ఎంపురం క్యాంపస్‌లో గురువారం ఫ్యాకల్టీ ఓరియంటేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తయ్యే సరికి శత శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేలా కార్యాచరణ ఉండాలని చెప్పారు. పారిశ్రామిక అవసరాలు, విషయ పరిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై దృష్టి సారించాలన్నారు. ఒత్తిడి లేకుండా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్స్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

28న ఘంటసాల గానామృతం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 28న ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఘంటసాల గానామృతం నిర్వహిస్తున్నట్లు జీబీఏ స్వరమాధురి, సర్వీస్ సొసైటీ నిర్వాహకులు నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన గాన చక్రవర్తి బి.ఎ.నారాయణచే గీతాలాపనలు జరుగుతాయని, అభిమానులంతా పాల్గొనాలని కోరారు.